ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

బుధవారం 30 ఏప్రిల్ 2025

మీనాక్షి అమ్మవారి ఆలయంలో

చిత్తిరై ఉత్సవాలు ప్రారంభం

● 8న తిరుకల్యాణోత్సవం

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది జిల్లాల ప్రజలంతా ప్రతియేటా తమిళ మాసమైన చిత్తిరై వచ్చిందంటే చాలు ఈనెలలో నిర్వహించనున్న రెండు ఉత్సవాలను తలచుకుని పులకించిపోతారు. వాటిలో మొదటిది మదురై సామ్రాజ్ఞి మీనాక్షి అమ్మవారి ఆలయంలో జరిగే చిత్తిరై ఉత్సవాలు, కాగా, రెండవది ఆ నగరానికి 25 కి.మీ.ల దూరంలో ఉన్న అళగర్ కోవిల్ నిర్వహించే చిత్తిరై ఉత్సవాలు, ఈ రెండు ఉత్సవాల్లో ఇటు మీనాక్షి సుందరేశ్వరుల తిరుకల్యాణోత్సవం, అటు అళగర్ మదురై నగర ఆగమన ఉత్సవాలు భక్తకోటికి కనువిందు చేస్తాయి. ప్రత్యేకించి కళ్లలగర్‌స్వామివారు స్వర్ణ అశ్వారూఢులై వైగై నదిలో వేంచేసే ఘట్టం తిలకించేందుకు ఆ నదిలో ఇసుకవేస్తే రాలనంతగా భక్తులు తరలివస్తారు. ఈ రెండు ఉత్సవాల్లో ఒకటైన మీనాక్షి అమ్మవారి చిత్తిరై ఉత్సవాలు మంగళవారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున మీనాక్షి, సుందరేశ్వరులకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధికి ఎదురుగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభాని పుష్పాలు, నవధాన్యాలతో అలంకరించారు. ఉదయం 10 గంటలకు సుందరేశ్వరుడు, మీనాక్షి అమ్మవారు సర్వాలంకరణశోభితులై ధ్వజస్తంభ మండపానికి మంగళవాయిద్యాల నడుమ వేంచేశారు. ఆ తర్వాత శివాచార్యులు వేద మంత్రాలను పఠిస్తుండగా స్వామి, అమ్మవార్ల ఎదుట స్వామిసన్నిధి ఎదుట ఉన్న కంబత్తడి మండపంలోని స్వర్ణధ్వజస్తంభంపై ధ్వజారోహణం చేశారు. 12 రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం, స్వామి, అమ్మవార్లు వివిధ వాహనాల్లో ఊరేగుతారు. ఈ వేడుకల్లో మొదటి రోజైన మంగళవారం రాత్రి కల్పవృక్షవాహనంలో స్వామి, అమ్మవారు చతుర్మాడ వీధుల్లో విహరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మీనాక్షీ సుందరేశ్వరుల తిరుకల్యాణం మే 8న అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 9న మహారథోత్సవం జరుగనుంది.



ధ్వజస్తంభ మండపంలో కొలువుదీరిన మీనాక్షీ సుందరేశ్వరులు



ధ్వజారోహణం చేస్తున్న శైవపండితులు, ప్రధానార్చకులు

రాష్ట్రంలో మళ్లీ వచ్చేది మా పాలనే

● 2026 నుంచి ద్రావిడ తరహా పాలన 2.0 ● అసెంబ్లీలో సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటివరకూ ద్రావిడ తరహా పాలన మొదటి భాగాన్నే అందరూ చూశారని, 2026లో రెండో భాగంగా ద్రావిడ తరహా పాలన 2.0 రానున్నదని ముఖ్యమంత్రి స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. శాసనసభ వార్షిక బడ్జెట్ సమావేశాల ముగింపు రోజైన మంగళవారం ఉదయం పోలీసు, అగ్నిమాపక శాఖలకు సంబంధించి చేసిన ప్రతిపాదనలపై సభ్యులడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలిస్తూ సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో డీఎంకే ఆరోసారి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయ్యిందని, ఐదో యేట అడుగుపెట్టబోతున్నామని చెబుతూ ఇప్పటివరకూ అమలు చేసిన పథకాలు, తమ ప్రభుత్వం నెలకొల్పిన రికార్డుల వల్ల ఏడోసారి కూడా డీఎంకే అధికారంలోకి వస్తుందన్నారు. గత అన్నాడీఎంకే పాలకుల అసమర్థ పాలన వల్లే అన్ని శాఖలు నిర్వీర్యమయ్యాయని, ఆర్థికంగా వెనుకబడిపోయిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం తీసుకున్న పటిష్టమైన చర్యల వల్ల 9.69 శాతం మేర ఆర్థిక పురోగతి సాధించిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఇవన్నీ తాను చెప్పడం లేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతిలో రాష్ట్రం రికార్డు సృష్టించిందని, జాతీయ స్థాయిలో 50 శాతం పాఠశాలల్లోనే ప్రయోగశాలలున్నాయని, అయితే రాష్ట్రంలో 98.3 శాతం పాఠశాలల్లో ప్రయోగశాలలున్నాయని, ఆసుపత్రులు, కర్మాగారాలు నెలకొల్పటంలోనూ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటోందన్నారు. పోలీసు శాఖలో మహిళా అధికారులు ఎక్కువగా పనిచేస్తున్న రాష్ట్రంగా కూడా పేరు తెచ్చుకుందన్నారు.



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ముప్పేటదాడిని ఎదుర్కొంటున్నాం

అధికారంలోకి వచ్చినప్పడి నుండి ఓ వైపు కేంద్ర ప్రభుత్వం, మరో వైపు గవర్నర్, ఇంకో వైపు నిధులలేమితో ముప్పేటదాడిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని, ఈ దాడులకు వ్యతిరేకంగా తాము జరుపుతున్న న్యాయపోరాటాలు విజయవంతమవుతుండటం తనకు సంతృప్తిని, ఆనందాన్ని కలిగిస్తోందని సీఎం పేర్కొన్నారు. శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్న రాష్ట్రాల్లోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, పర్యాటకులు ఎక్కువగా వస్తారని, తన నాయకత్వంలోని పోలీసు శాఖ శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడం వల్లే రాష్ట్రం ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ గగ్గోలు పెడుతున్నవారికి తాను చెప్పే సమాధానం ఒక్కటేనని, ఈ రాష్ట్రంలో మణిపూర్‌లో జరిగినట్లు అల్లర్లు జరుగలేదని, కశ్మీర్‌లా ఉగ్రవాదుల దాడులు లేవని, కుంభమేళాలో జరిగినట్లు మరణాలు సంభవించలేదనేది అందరూ గుర్తించాలని చెప్పారు. శాంతి భద్రతలను సంరక్షించడానికి రేయింబవళ్లు శ్రమించే పోలీసు సేవలను ప్రజలు గుర్తించేలా 1859లో మద్రాస్ ప్రెసిడెన్సీ జిల్లా పోలీసుల చట్టం ఆమోదించిన రోజు సెప్టెంబర్ 6వ తేదీని ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా 'పోలీసు డే'గా జరుపుకునేలా ఉత్తర్వు జారీ చేస్తున్నానని ప్రకటించారు. ఆ రోజునే సేవాపరులైన పోలీసులకు పతకాలు, అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం తమిళ భాషకోసం, రాష్ట్ర హక్కుల సాధన కోసం సాగిస్తున్న పయనం కొనసాగుతుందని, ఇప్పటివరకూ ద్రావిడ తరహా పాలన పార్ట్-1ను చూశారని, 2026లో 2.0 లోడింగ్ చూడబోతున్నార అన్నారు.

'కాలనీ' పదం తొలగింపు...

ప్రభుత్వ రికార్డుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు నివసించే ప్రాంతాలను ప్రస్తుతం 'కాలనీ'లు అని పిలుస్తున్నారని, ఆ పదంతో అక్కడి ప్రజలను 'కాలనీవాసులు' అని పిలుస్తుండటం అంటరానితనాన్ని గుర్తు చేసేలా ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ రికార్డులలో ఈ 'కాలనీ' అనే పదాన్ని తొలగించనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. బీజేపీ సభ్యురాలు వానతి శ్రీనివాసన్ ఉత్తరాది కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా వేయాలని సూచించారని, ఆమె సూచన తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు.

ముగిసిన శాసనసభ సమావేశాలు

శాసనసభ సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు గత నెల 14వ తేది ప్రారంభమయ్యాయి. తొలిరోజు రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు ప్రవేశపెట్టగా, ఆ రోజు సాయంత్రం స్పీకర్ నేతృత్వంలో జరిగిన సభా వ్యవహారాల మండలి సమావేశంలో ఏప్రిల్ 30వ తేది వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. మరుసటి రోజైన 15వ వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్ సెల్వం ప్రవేశపెట్టారు. అనంతరం 17 నుంచి 21వ తేది వర కు బడ్జెట్‌పై చర్చ, 21వ తేదీ నుంచి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి, ఆయా శాఖల మంత్రులు సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో, మంగళవారం శాసనసభ సమావేశాలు నిరవధికంగా ముగిసినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు. ఈ సమావేశాల్లో సీఎం 110వ నిబంధనల కింద పలు ప్రకటనలు చేశారు.

ఇప్పుడు చేసిందే చాలు..

ప్రగల్భాలు వద్దు

సీఎంపై ఈపీఎస్ ఆగ్రహం

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలను పక్కదోవ పట్టించేలా ప్రకటనలు గుప్పిస్తున్న డీఎంకే పాలన ఇక చాలని, దీనిని కూడా గొప్పగా ప్రగల్భాలు పలకాల్సిన అవసరం లేదని అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ముఖ్యమంత్రి స్టాలిన్‌పై ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నాలుగేళ్ల డీఎంకే పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, బూటకపు ఎన్‌కౌంటర్లు పెరిగాయని, ఇవన్నీ స్టాలిన్ పాలనలోని విశేషాలని యెద్దేవా చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఇతర రాష్ట్రాలకే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతయ్యాయని చెప్పటానికి డీఎంకే విదేశీ తమిళుల విభాగమే ప్రధాన సాక్ష్యమన్నారు. సామాజిక న్యాయం ఏమేరకు కాపాడబడుతోందో వైంగైవయల్ సంఘటన సాక్ష్యం చెబుతుందని తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ గంజాయి 2.0, 3.0, 4.0 అన్నీ విఫలమయ్యాయని, ఇవి చాలవన్నట్లు స్టాలిన్ రాష్ట్రంలో రానున్నది ద్రావిడ తరహా పాలన 2.0అని ప్రగల్భాలు చెప్పటం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తలెత్తుకుని నడిచిన రాష్ట్రం ఇప్పుడు జెయిలుపై విడుదలైన నేరస్థులందరికీ త్యాగులుగా అవార్డులిచ్చి తలదించుకునేలా చేసిన ఘనత స్టాలిన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు 'బై...బై స్టాలిన్' అంటూ వీడ్కోలు పలకడం తథ్యమన్నారు. 2026లో ఒకే వెర్షన్ మాత్రమేనని, అది రాష్ట్రంలో అన్నాడీఎంకే వెర్షన్ మాత్రమేనని ఈపీఎస్ తెలిపారు.



అసెంబ్లీ వెలుపల మీడియాతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి

రైల్వేస్టేషన్లలో నిఘా పెంపు

● ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్రంలోని పలు రైల్వేస్టేషన్లలో నిఘా ముమ్మరం చేశారు. ముఖ్యంగా సెంట్రల్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లలో పోలీసుల భద్రత కట్టుదిట్టం చేశారు. ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సెబాస్టియన్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీని డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీ చేపడుతున్నారు. ప్లాట్‌ఫారాలు, పరిసర ప్రాంగణాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, పార్శిల్ కార్యాలయాలు సహా పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అలాగే, సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో కూడా రైల్వే పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అంతేగాకుండా అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు



ప్రయాణికుల లగేజీ తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

రూ.16 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలు

● సీఎం స్టాలిన్ వెల్లడి

అడయార్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా కేంద్రంలోని అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంతో పాటు మొత్తం ఏడు ప్రాంతాల్లో రూ.16.80 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలు నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మంగళవారం జరిగిన సభా కార్యక్రమాల్లో ఆయన ఒక ప్రకటన చేస్తూ, తిరువణ్ణామలై అరుణచలేశ్వర స్వామి దేవస్థానం, పెరంబలూరు జిల్లా వేప్పంతట్టై, వేలూరు జిల్లా పల్లికొండా, విల్లుపురం జిల్లా కండమంగళం, కరూర్ కుళిత్తలై, కృష్ణగిరి శూలగిరి, కన్నియాకుమారి రాజాక్కంమంగళం ప్రాంతాల్లో రూ.16.80 కోట్లతో అగ్నిమాపక కేంద్రాలను నిర్మించనున్నట్టు ప్రకటించారు.

సీఎం పతకాల సంఖ్య పెంపు

పోలీస్ శాఖ తరపున ప్రతి యేటా అందజేసే అన్నా పతకాల సంఖ్యను 100 నుంచి 150కు, సీఎం మెడల్స్‌ను 3 వేల నుంచి 5 వేలకు పెంచినట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. అన్నా పతకాల సంఖ్యను వంద నుంచి 150కు పెంచడం వల్ల ఖర్చు రూ.1.08 కోట్లకు పెరుగుతుందన్నారు. అలాగే, సీఎం మెడల్స్ సంఖ్యను 3 వేల నుంచి 5 వేలకు పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.4.80 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు.

క్రీడా వర్సిటీ ఉప కులపతి నియామకం...

ప్రభుత్వానికే అధికారం

● ముసాయిదా చట్టం దాఖలు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యాయామ విద్య క్రీడల విశ్వవిద్యాలయానికి ఉపకులపతి నియామకం, తొలగింపులో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం కల్పించే చట్ట ముసాయిదా శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసనసభ సమావేశాల్లో మంగళవారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తమిళనాడు వ్యాయామ విద్య, క్రీడల విశ్వవిద్యాలయ చట్ట సవరణ ముసాయిదా ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిపాదన మేరకు, విశ్వవిద్యాలయాలకు సంబంధించిన పది బిల్లులను మళ్లీ ఆమోదించారు. సుప్రీం కోర్టు ఈనెల 8వ తేది ఇచ్చిన తీర్పు ప్రకారం, ఆ బిల్లులన్నీ 2023 నవంబరు 18వ తేది ఆమోదింపబడినట్లు గెజిట్‌లో ప్రకటించారు. ఆ విశ్వవిద్యాలయాల చట్టం ద్వారా, 18 విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల నియామకం, పదవుల నుండి తొలగింపు తదితరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం కల్పించారు. అలాగే, తమిళనాడు వ్యాయామ విద్య క్రీడల విశ్వవిద్యాలయ ఉపకులపతి నియామకం, తొలగింపు తదితరాలకు ఈ చట్టం వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా, ఈ సవరణ చట్టాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శాసనసభలో ప్రవేశపెట్టారు. ఆ సవరణ చట్టం ప్రకారం, ముఖ్యమంత్రి ఇటీవల శాసనసభలో ప్రకటించిన విధంగా, విశ్వవిద్యాలయాల సిండికేట్‌లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించనున్నారు. అలాగే, ఈ విశ్వవిద్యాలయ సిండికేట్‌లో న్యాయశాఖ కార్యదర్శిని సభ్యుడిగా నియమించేలా ఈ ముసాయిదా చట్ట సవరణ దాఖలుచేశారు.

పుదువై సీఎం నివాసానికి మళ్లీ బాంబు బెదిరింపు

పుదుచ్చేరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి నివాసానికి మళ్లీ బాంబు బెదిరింపు రావటంతో పోలీసులు, బాంబ్‌స్క్వాడ్‌తో కలిసి ముమ్మర తనిఖీలు జరిపారు. ఈ నెల 19న పుదుచ్చేరి తిలాస్‌పేటలో ఉన్న రంగస్వామి నివాసంలో బాంబు లుంచామని, అవి ఏ సమయంలోనైనా పేలవచ్చని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. దీంతో పోలీసులు తనిఖీ చేసిన మీదట అది ఉత్తుత్తి బెదిరింపేనని నిర్ధారించారు. అదే రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయం, అగ్నిమాపక కార్యాలయం, జిప్‌మర్ ఆస్పత్రి, పుదుచ్చేరి బీచ్‌రోడ్డులో ఉన్న హోటళ్ళకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో మళ్ళీ మంగళవారం ఉదయం సీఎం నివాసంలో బాంబులు పేలతాయంటూ ఈమెయిల్ సందేశం వచ్చింది. దీంతో బాంబ్‌స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలాలతో వెళ్ళి ముమ్మర తనిఖీలు చేపట్టారు. చివరకు ఇది కూడా ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని తెలుసుకుని పోలీసులు ఊరట చెందారు. ఇదిలా ఉండగా సీఎం నివాసంతో పాటు ఫ్రాన్స్ రాయబార కార్యాలయం, అప్పా వైద్యసామి ఆలయానికి కూడా మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆ రెండు చోట్ల కూడా తనిఖీలు జరిపి అవి కూడా ఉత్తుత్తి బాంబు బెదిరింపులను నిర్ధారించారు.



పుదుచ్చేరి సీఎం రంగస్వామి నివాసం ఎదుట తనిఖీ చేస్తున్న పోలీసులు

రేపటి నుంచి హైకోర్టుకు సెలవులు

● ఐదుగురు న్యాయ మూర్తుల పదవీ విరమణ

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టుకు మే ఒకటి నుండి జూన్ ఒకటి వరకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ సెలవు దినాల్లో సెలవు కాలపు కోర్టులు పనిచేస్తాయని హైకోర్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ సెలవుల్లో హైకోర్టు న్యాయమూర్తులు ఎస్.సుందర్, భవానీ సుబ్బురాయన్, హేమలత, నక్కీరన్, శివజ్ఞానం పదవీ విరమణ చేయనున్నారు. వీరికి బుధవారం హైకోర్టు ప్రాంగణంలో వీడ్కోలు సభ నిర్వహించనున్నారు. ఈ ఐదుగురు న్యాయమూర్తుల పదవీ విరమణతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 60కి తగ్గనుంది. కోర్టు సెలవుల కారణంగా అత్యవసరమైన కేసులపై న్యాయమూర్తులు మాలా, అరుళ్‌మురుగన్, విక్టోరియా గౌరీ తదితరులు మే 7, 8 తేదీల్లో విచారణ జరుపుతారు. మే 14, 15, 21 తేదీల్లో అత్యవసరకేసులపై న్యాయమూర్తులు లక్ష్మీ నారాయణన్, నిర్మల్‌కుమార్, స్వామినాథన్ తదితరులు విచారణ జరుపుతారు. మే 28, 29 తేదీల్లో న్యాయమూర్తులు సత్యనారాయణ ప్రసాద్, సెంథిల్‌కుమార్, రామమూర్తి, తిలకవతి తదితరులు విచారణ జరుపుతారు. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో న్యాయమూర్తులు బాలాజీ, జ్యోతిరామన్, శక్తివేల్, రామకృష్ణన్, వేల్‌మురుగన్, పూర్ణిమ, రాజశేఖర్, శ్రీమతి, విజయకుమార్, వడమలై, షమీన్ అహమ్మద్, ఆనంద్ వెంకటేష్, దండపాణి వేసవి కాలపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

సమాచార దృష్టి

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'నాన్ ముదల్వన్' పథకంలో రైల్వే, బ్యాంక్ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. రాష్ట్ర వృత్తి నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలలు శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణలో చేరేందుకు మే 31వ తేది రెండు రాతపరీక్షల ద్వారా సుమారు వెయ్యి మందిని ఎంపిక చేయనున్నారు. రైల్వే, ఎస్ఎస్‌సీ, బ్యాంక్ తదితరాల్లో ఏదైనా ఒక పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మే 13వ తేదిలోగా https://www.naanmudhalvan.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరకాస్తు చేసుకోవచ్చని సచివాలయం ప్రకటనలో తెలియజేసింది.

7 నుంచి తిరుచ్చి-కొచ్చిన్ మధ్య విమాన సేవలు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి-కొచ్చిన్ మధ్య మే 7వ తేది నుంచి విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మార్గంలో ఇండిగో సంస్థ 2018లో విమాన సేవలు ప్రారంభించగా, నిర్వహణ, అనివార్య కారణాలతో ఈ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ మే 7వ తేది నుంచి తిరుచ్చి-కొచ్చిన్ మధ్య విమానాలు నడుపనుంది. ఆ ప్రకారం, ప్రతిరోజు తిరుచ్చి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే విమానం ఒంటి గంటకు కొచ్చిన్ చేరుకుంటుంది. మరుమార్గంలో కొచ్చిన్ నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరి 2.40 గంటలకు కొచ్చిన్ చేరుకుంటుందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముహూర్తం రోజైన బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలియజేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ దినేష్ పొన్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో.. ముహూర్తపు రోజుల్లో ప్రజలు ఇళ్లు, భూముల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతుంటారని, ఆ రోజున రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ ఉంటుందన్నారు. ప్రజల సౌకర్యార్థం రోజువారీ అందించే టోకెన్ల కన్నా అదనంగా అందించనున్నామన్నారు. ఆ ప్రకారం, ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయాల్లో 150, ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఉన్న కార్యాలయాల్లో 300 టోకెన్లు, తత్కాల్‌లో అదనంగా నాలుగు టోకెన్లు అందించనున్నట్లు తెలిపింది.

జూన్ 4లోగా మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'మహిళా సాధికారత నిధి' పథకానికి జూన్ 4వ తేదిలోగా మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంలో మహిళలకు నెలకు రూ.1,000 అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంలో పలువురు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, అర్హులైన వారిని ఈ పథకంలో చేర్చాలనే విజ్ఞప్తి మేరకు, ఈ పథకంలో కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇటీవల శాసన సభలో ప్రకటించారు. ఆ ప్రకారం, దరఖాస్తులు నిరాకరణకు గురైనవారు, కొత్తగా పొందగోరే వారు తగిన సర్టిఫికెట్లతో జూన్ 4వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ ప్రకటన విడుదల చేశారు.

సెలవుల సందర్భంగా ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం (మే డే), వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం 2,119 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలియజేసింది. ఆ ప్రకారం కిలాంబక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి సహా పలు ప్రాంతాలకు బుధవారం 565 బస్సులు, శుక్ర, శనివారాల్లో తలా 375 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు బుధవారం వంద బస్సులు, శుక్ర, శనివారాల్లో తలా 90 బస్సులు నడుపనున్నారు. మాధవరం నుంచి బుధవారం నుంచి శనివారం వరకు 24 బస్సులు నడుపనున్నారు. అలాగే, ఈరోడ్, బెంగళూరు, తిరుప్పూర్, కోవై నుంచి పలు ప్రాంతాలకు 250 బస్సులు, సెలవులు ముగించుకొని తిరిగి వచ్చేందుకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలియజేసింది.

వెయ్యి ప్రభుత్వ బస్సులకు సీఎన్‌జీ సదుపాయం

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థలో వెయ్యి బస్సులను సీఎన్‌జీకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం డీజిల్ ధరల కారణంగా వాహనచోదకులు సీఎన్ఐజీతో నడిచే వాహనాలపై మొగ్గుచూపుతున్నారు. ఆ ప్రకారం, రవాణా సంస్థ కూడా సీఎన్‌జీ వాహనాలు నడపాలని నిర్ణయించింది. రవాణా సంస్థ పరిధిలో 8 డివిజన్లలో ప్రయోగాత్మకంగా 23 సీఎన్‌జీ బస్సులు నడుపారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీఎన్‌జీ వినియోగించడం వల్ల కి.మీ రూ.3-రూ.4 వరకు, ఏడాదికి సుమారు రూ.75 వేల వరకు ఆదా అవుతోంది. ఈ బస్సుకు ఒక సారి ఛార్జింగ్ చేస్తే 600 కి.మీ వరకు వినియోగించవచ్చు. దీంతో, వెయ్యి సీఎన్జీ బస్సులు నడపాలని నిర్ణయించిన ప్రభుత్వం, త్వరలో టెండర్లు ఆహ్వానించి సంస్థను ఎంపిక చేసి ఆరు నెలల్లో ఈ బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

వీఐటీ విద్యార్థుల ప్రతిభ
ప్రశంసనీయం


సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

● అభినందన సభలో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ వేలూరు వీఐటీ కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్తు బాగుండాలంటే విద్య ఎంతో అవసరమని తెలిపారు. పోటీ పరీక్షల్లో అత్యధిక ర్యాంకులు సాధించిన వీఐటీ కళాశాల విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ఆమె విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు విద్యాభివృద్ధి విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ గాయత్రి, విద్యాశాఖ అడ్వైజర్ జయప్రకాశ్, కళాశాల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ బెయిలుపై విడుదలైన నిందితుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ధర్మపురి జిల్లాలో చోటుచేసుకుంది. కుండల్‌పట్టి సమీపం జాతీయ రహదారిలోని ఓ విడిది గృహంలో ఓ పురుషుడు, మహిళ గది అద్దెకు తీసుకున్నారు. ఘటన జరిగిన రోజు వారు ఎంతవరకు గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన విడిది గృహం సిబ్బంది, మదికోన్‌పాళయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి గదిలో పరిశీలించగా గాయాలతో మహిళ మృతి చెందగా, పురుషుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. విచారణలో... మృతులు మదికోన్‌పాళయం ప్రాంతానికి చెందిన రమేష్‌కుమార్ (32), మహాలక్ష్మి (28) దంపతులని, వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని తెలిసింది. ఐదేళ్ల క్రితం ఓహత్యకేసులో యావజ్జీవ శిక్ష కారణంగా జైలులో ఉన్న రమేష్‌కుమార్, కొద్ది నెలల క్రితం బెయిలుపై విడుదలయ్యారు. కాగా దంపతులు విడిది గృహానికి వెళ్లిన సమయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో రమేష్ భార్యపై దాడిచేయడంతో ఆమె మృతిచెందింది. దీంతో, రమేష్ కూడా ఆ గదిలోనే ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో తేలింది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వాటర్ ట్యాంక్‌లో పడి బాలిక మృతి

● మదురై నర్సరీ పాఠశాలలో ఘటన

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మదురై నర్సరీ పాఠశాలలో చదువుతున్న మూడేళ్ల చిన్నారి వాటర్ ట్యాంక్‌లో పడి మృతిచెందిన ఘటన కలకలం రేపింది. మదురై కేకే నగర్ ప్రాంతంలో ఉన్న నర్సరీ పాఠశాలలో ఆరుద్ర (3) అనే చిన్నారి చదువుతోంది. మంగళవారం ఉదయం పాఠశాల ప్రాంగణంలో స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న ఆరుద్ర, అక్కడున్న అండర్ వాటర్ ట్యాంక్‌లో పడిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని, ట్యాంక్ నుంచి చిన్నారిని వెలికితీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక ఆరుద్ర మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు నర్సరీ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, నలుగురు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలకు సీలు వేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులు..?

● విశాఖ కమిటీ విచారణకు ఉత్తర్వులు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్‌పై ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదును విశాఖ కమిటీ సమగ్ర విచారణ చేపట్టాలని ఉప కులపతి చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వర్సిటీలో కెమిస్ట్రీ ప్రొఫెసర్ వద్ద పీహెచ్‌డీ చేసేందుకు ఓ యువతి పేరు నమోదు చేసుకుంది. అనంతరం అదే విభాగంలో తాత్కాలికంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు ప్రొఫెసర్లు లైంగిక వేధింపులు, మానసిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై తిరునల్వేలి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ విశ్వవిద్యాలయంలో విచారణ చేపట్టినా, దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోలేదని సమాచారం. ఈ క్రమంలో, తాజాగా బాధిత యువతి తన ఆరోపణలతో ఆడియో విడుదల చేసింది. దీంతో, మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుపై విశాఖ కమిటీ విచారణ జరపాలని ఉప కులపతి చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు.

అత్త హత్యకేసులో అల్లుడికి యావజ్జీవ శిక్ష

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అత్తను హతమార్చిన అల్లుడికి కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. మాధవరానికి చెందిన బాలాజీ 2021లో భార్య నడవడికపై అనుమానించి ఆమెతో ఘర్షణకు దిగాడు. అతడి వేధింపులు తట్టుకోలేని సుధ, తన ఇద్దరు పిల్లలతో కలసి వ్యాసర్పాడిలో ఉన్న తల్లి ఇంటికి వెళ్లింది. తన స్నేహితుడు దివ్యానంద్‌తో కలసి అత్త లత ఇంటికి వెళ్లిన బాలాజీ, ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. కోపంలో బాలాజీ అతని స్నేహితుడు దాడి చేయడంతో లత మృతిచెందింది. ఈ వ్యవహారంపై హత్య, హత్యాయత్నం తదితర సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన ఎంకేబీ నగర్ పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారించిన చెన్నై 6 అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మురుగేశన్... మహలపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో బాలాజీకి ఏడేళ్ల జైలు, రూ.1,000 జరిమానా, అత్తను హతమార్చిన కేసులో జీవిత ఖైదు, రూ.2,000 జరిమానా విధిస్తూ, రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని ఆదేశించారు. ఈ కేసులో బాలాజీ స్నేహితుడు దివ్యానంద్‌పై ఆరోపణకు తగిన ఆధారాలు లేవంటూ, అతడిని కేసు నుండి విడుదల చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

లైంగిక వేధింపు కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత 2019వ సంవత్సరంలో బాలికపై లైంగిక వేదింపులకు పాల్పడిన రియాజ్ (54) అనే వ్యక్తికి వేలూరు జిల్లా న్యాయస్థానం 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తన ఇంటి పక్కన ఉన్న బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన కారణంగా న్యాయస్థానం 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పువెలువరించింది.

ఎయిర్ అబుదాబీ విమానంలో సాంకేతికలోపం

అడయార్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అబుదాబి నుంచి చెన్నైకు మంగళవారం వేకువజామున వచ్చిన ఎయిర్ అబుదాబీ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఉదయం 5.05గంటలకు బయలుదేరి వెళ్ళాల్సిన ఈ విమానం ఉదయం 7 గంటలకు వెళ్ళింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అబుదాబి నుంచి ఉదయం 4.15 గంటలకు 192 మంది ప్రయాణికులతో ఎయిర్ అబుదాబీ విమానం చెన్నై వచ్చింది. తిరిగి ఉదయం 5.05 గంటలకు అబుదాబీకి బయలుదేరింది. అయితే, విమానం రన్‌వేపైకి వెళ్ళిన తర్వాత విమానంలో సాంకేతికలోపం ఉన్నట్లు పైలెట్లు గుర్తించి, ఈ లోపాన్ని సరి చేసిన తర్వాత ఉదయం 7 గంటలకు బయలుదేరుతుందని ప్రకటించారు. దీంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మూడో బిడ్డను కనేందుకు ప్రోత్సాహకమివ్వాలి

● ప్రభుత్వానికి ఎమ్మెల్యే విజ్ఞప్తి


డీఎంకే ఎమ్మెల్యే బర్గూర్ మదియళగన్

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మూడో బిడ్డను కనడానికి ముందుకొచ్చే తల్లిదండ్రులకు ప్రోత్సాహకం ఇచ్చే అంశం ప్రభుత్వం పరిశీలించాలని శాసనసభలో ఓ సభ్యుడు విజ్ఞప్తి చేశారు. శాసనసభ సమావేశాల్లో పద్దులపై చర్చ జరుగుతుండగా డీఎంకే సభ్యుడు బర్గూర్ మదియళగన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో బిహార్ రాష్ట్ర జనాభా, తమిళనాడు రాష్ట్ర జనాభా సమానంగా ఉండేవన్నారు. ప్రస్తుతం బిహార్‌లో నాలుగు రెట్లు జనాభా పెరిగిందన్నారు. జనాభా సంఖ్య ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందన్నారు. డీలిమిటేషన్ అమలుకు వస్తే రాష్ట్రం పలు నియోజకవర్గాలు కోల్పోయే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో 'మనం ఇద్దరం' అనే వైఖరి ఉందని, కావున ఇక నుంచి 'మనం ముగ్గురం' అనే విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అందుకోసం మూడో బిడ్డకు జన్మనివ్వాలని ముందుకొచ్చే తల్లిదండ్రులు రాయితీలతో పాటు ప్రోత్సాహకాలు అందించాలని సభ్యుడు బర్గూర్ ప్రభుత్వానికి సూచించారు. కాగా, ఇప్పటికే డీలిమిటేషన్‌తో ప్రభావితమయ్యే రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు పార్టీ నేతలతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రస్తుత పార్లమెంటు సీట్ల సంఖ్య మరో 25 ఏళ్లు కొనసాగించాలని తీర్మానం చేసి ఆమోదించారు. ఈ పరిస్థితుల్లో శాసనసభలో ఓ సభ్యుడు ప్రసంగం అందరి దృష్టి ఆకర్షించడంతో పాటు, దీనికి సంబంధించి త్వరలో ఓ ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు సమాచారం.

ఘనంగా సామ్యూల్ హానిమన్ జయంతి


సమావేశంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హోమియోపతి పితామహుడు డా.క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యూల్ హానిమన్ 270వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదంబాక్కంలోని మదన్ హోమియోపతి క్లినిక్ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు డా.కొల్లిరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తరమణిలోని యూనివర్శిటీ ఆఫ్ మెద్రాస్ మెడికల్ బయోకెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.పి.కలైసెల్వి హాజరై... ప్రస్తుతం హోమియో చికిత్సా విధానంలో వస్తున్న మార్పులు వివరించారు. అలాగే, ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఐహెచ్‌పీ తమిళనాడు జనరల్ సెక్రటరీ డా.ఎన్నార్ జయకుమార్, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ ఆర్.విజయ్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రొఫెసర్ జి.నాగేంద్రబాబు సహా వైద్యులు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హానిమన్ చిత్రపటానికి అతిథులు, నిర్వాహకులు నివాళులర్పించారు.

వీసీకే నాయకుడి దారుణహత్య


శరత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు హైరోడ్డు సమీపంలో విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే)జిల్లా ఆర్గనైజర్ శరత్‌కుమార్‌ను గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. వేలూరు సమీపంలోని అరియాన్‌కుప్పం ప్రాంతంలో నివసిస్తున్న శరత్‌కుమార్ గత రెండేళ్లగా వీసీకే పార్టీలో చురుగ్గా పాల్గొంటున్నాడు. దీనిని సహించలేని కొందరు ఈ హత్యకు పాల్పడి వుంటారని అతని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చర్యలు చేపట్టారు.

పొన్ముడి సీటు వీవీ వేలుకు కేటాయింపు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గంలో మళ్లీ చేరిన మనో తంగరాజ్‌కు శాసనసభలో రెండో వరుసలో చివరి సీటు పక్కనే సీటు కేటాయించారు. శాసన సభలో ముందు వరుసలో 6వ నెంబరు సీటులో పొన్ముడి కూర్చొనేవారు. ప్రస్తుతం ఆ సీటు మంత్రి ఏవీ వేలుకు కేటాయించారు. ఇక, మంత్రి పదవులు కోల్పోయిన పొన్ముడి, సెంథిల్ బాలాజీలకు మూడో వరుసలో సీట్లు కేటాయించారు. అలాగే, మంత్రులు ముత్తుస్వామి, శివశంకర్ సీట్లు కూడా మారాయి.

రేపు తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా గురువారం తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడువనున్నాయి. ఆ ప్రకారం, చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు, చెన్నై బీచ్-వేళచ్చేరి, చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్-తిరుత్తణి, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట మధ్య రైళ్లు మే 1వ తేది ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఆదివారం టైం టేబుల్ ప్రకారం నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

మేడవాక్కంలో 'సెడార్'

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేడవాక్కంలో నవీన్స్ రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థ స్టార్‌వుడ్ టవర్స్‌కు చెందిన ఐకానిక్ మ్యూనిటీలో ప్రీమియం టవర్ అయిన 'సెడార్'ను ప్రారంభించింది. దీని గురించి ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. సెడార్ 166 యూనిట్లు కలిగి, 100 కంటే ఎక్కువ రెడిటీ టు యూజ్ సౌకర్యాలతో 2,3 బెడ్రూంల ఇళ్లను అందిస్తోందన్నారు. ఇది అత్యంత అవార్డు పొందిన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ తీర్చడానికే తాము 'సెడార్'ను ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

మెట్రో పథకానికి కేంద్ర సాయం రూ.8,445 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.8,445 కోట్లు కేటాయించిందని సమాచార హక్కు చట్టం కింద తెలిసింది. నగరంలో మూడు మార్గాల్లో 116 కి.మీ మేర రూ.63,246 కోట్ల తో మెట్రో రైలు రెండవ విడత ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో మెట్రో ప్రాజెక్ట్ నిధులు కేటాయించరా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. ఈ విషయమై సమాజ సేవకుడు దయానంద్ కృష్ణన్ సమాచారం హక్కు చట్టం కింద కేంద ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చెన్నై మెట్రో రైలు రెండో విడత ప్రాజెక్టుకు రూ.8,445 కోట్లు కేటాయించినట్లు కేంద్రప్రభుత్వ తెలిపిందని దయానంద్ కృష్ణన్ తెలిపారు.

కరుప్పేశ్వరర్ రథోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం

● కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో ప్రసిద్ధి చెందిన గంగమ్మ దేవాలయ జాతర ఏర్పాట్లను మంగళం ఉదయం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. అదేవిధంగా గుడియాత్తంలోని కరుప్పేశ్వరాలయ రథోత్సవం జరగనున్న సందర్భంగా అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుడియత్తం గంగమ్మ జాతర ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయాలని ఆ ప్రాంత హిందూ సంఘం నాయకులు కలెక్టర్‌ను అభ్యర్థించారు.

గుడియాత్తం గంగమ్మ జాతరకు ఏర్పాట్లు

15న సెలవు ప్రకటించిన ప్రభుత్వం

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలో ప్రసిద్ధి చెందిన గంగమ్మ ఆలయం జాతరకు ప్రత్యేక అంశాలతో ముస్తాబయ్యింది. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం, మే 15వ తేదీ ఉత్సవాన్ని పురస్కరించుకుని సెలవు ప్రకటించింది. జిల్లాలోనే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ వేడుకలకు భక్తులు వేలాది సంఖ్యలో తరలివస్తున్న క్రమంలో పోలీసు భద్రతా ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. అదేవిధంగా 15వ తీదీని లోకల్ హాలిడేగా ప్రకటించారు. దీంతో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఆ రోజు పనిచేయవని పేర్కొన్నారు.

అతడి నేత్రాలు సజీవం

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరణి కోటై రోటరీ సంఘ అధ్యక్షుడు గోకుల్‌రాజ్ తండ్రి ఎస్ బాలకృష్ణన్ (73) అనారోగ్యంతో మంగళవారం ఆస్పత్రిలో మృతిచెందారు. మృతుడి చివరి కోరిక మేరకు అతని కుటుంబ సభ్యులు మృతుడి కళ్ళను అగర్వాల్ వైద్యశాలకు దానం చేశారు. మృతదేహం నుండి కళ్లను తీసుకున్న వైద్యసిబ్బంది మృతుడి కుటుంబాన్ని అభినందించారు.

రేపు టాస్మాక్ దుకాణాలకు సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా టాస్మాక్ దుకాణాలు మూసివేయాలని ఉత్తర్వులు జారీచేశారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయించే బార్లు, వ్యక్తులు, దుకాణాలపై కఠిన చర్యలు చేపడతామని టాస్మాక్ సంస్థ హెచ్చరించింది.

జైలు నిర్వహణపై అధికారుల ఆకస్మిక తనిఖీలు



తిరుత్తణి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీసాలైలో వున్న జిల్లా జైలు నిర్వహణపై అధికారుల మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా జడ్జీ జూలియట్ పుష్ప, తిరువళ్లూరు జిల్లా చీఫ్ క్రిమినల్ జడ్జి మీనాక్షి, తిరువళ్లూ జిల్లా కలెక్టర్ ప్రతాప్ పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీలో జైలు లో తాగునీరు, మరుగుదొడ్లు, వంటగదులు, ఖైదీలకు ఇచ్చే ఆహారంలో నాణ్యత తదితర విషయాల గురించి జైలర్‌తో మాట్లాడారు. అదేవిధంగా ఖైదీలుండే గదులను పరిశీలించి జైలు వసతులు, వైద్యసౌకర్యాలకు సంబంధించిన విషయాలు ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులోని కొన్ని గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని గ్రహించిన కలెక్టర్ ప్రతాప్ మరో 15 రోజుల్లోగా పునర్నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస పెరుమాళ్ సహా పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'క్యాంపస్ యూఎస్ఏ'తో జడ్సన్ వర్సిటీ ఒప్పందం


ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండో - యూఎస్ విద్యా రంగంలో అగ్రగామి సంస్థ అయిన క్యాంపస్ యుఎస్ఏతో అమెరికాలోని జడ్సన్ విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు జడ్సన్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ నిక్కి ఫెన్నెర్న్, గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ డానా ఓనయేమి, క్యాంపస్ యూఎస్ఏ వ్యవస్థాపకుడు హరీష్ అనంతపద్మనాభన్ తదితరులు మంగళవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ అనంతపద్మనాభన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ విద్య, కెరీర్ విజయాన్ని సాధించడానికి విద్యార్థుల ద్వారాలను తెరవడం తాము సంతోషిస్తున్నామన్నారు. మే 3వ తేదీ చెన్నైలోని అకార్డ్ మెట్రోపాలిటన్ హోటల్లో 'స్టడీ ఇన్ ద యూఎస్ఏ' పేరుతో ప్రత్యేక కార్యక్రమం జరుగుతోందని, అక్కడ విద్యార్థులు జడ్సన్ వర్సిటీ అధికారులతో మాట్లాడి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ఉన్నత విద్యా అవకాశాలను అన్వేషించవచ్చని వివరించారు. అక్కడే స్పాట్ అడ్మిషన్లను కూడా పొందవచ్చని హరీష్ పేర్కొన్నారు.

'ఆన్‌లైన్ రమ్మీ' తీర్పు వాయిదా

పెరంబూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ క్రీడల వ్యవహారంపై తేది ప్రకటించకుండా మద్రాసు హైకోర్టు తీర్పు వాయిదావేసింది. రాష్ట్రంలో ఆన్‌లైన్ క్రీడలు క్రమబద్ధీకరిస్తూ 2022లో తమిళనాడు ఆన్‌లైన్ జూదం నిషేధం ఆన్‌లైన్ గేమ్‌ల నియంత్రణ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో విధి విధానాలతో ఫిబ్రవరి 14వ తేది జీవో విడుదలైంది. అందులో... ఆన్‌లైన్ క్రీడలు ఆడేందుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి, అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5 గంటలకు ఈ క్రీడలకు ఎవరినీ అనుమతించరాదు తదితర నిబంధనలున్నాయి. ఈ నిబంధనలు వ్యతిరేకిస్తూ ఆన్‌లైన్ క్రీడా సంస్థలు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశాయి. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, కె.రాజశేఖర్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఈ పిటిషన్ మంగళవారం మళ్లీ విచారణకు రాగా, అందరి తరపు వాదనలు లిఖితపూర్వకంగా దాఖలుచేశారు. అనంతరం ధర్మాసనం, తేది ప్రకటించకుండా తీర్పు వాయిదావేసింది.

అర్ధరాత్రి పోలీసుస్టేషన్‌లో చొరబడిన చిరుత


నడువట్టమ్ స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న చిరుతపులి

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ సమీపం నడువట్టమ్ ప్రాంతంలో అడవి నుండి వచ్చిన చిరుతపులి అక్కడి పోలీసుస్టేషన్‌లో చొరబడింది. ఆ చిరుత పోలీసుస్టేషన్ గదులన్నీ కలియతిరిగి వెళ్తుండగా అప్పుడే నగరగస్తీకి వెళ్ళి తిరిగొచ్చిన ఓ కానిస్టేబుల్ చూసి దిగ్భ్రాంతి చెందాడు. కాసేపయ్యాక స్టేషన్ తలుపులను మూసి అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆ కానిస్టేబుల్ తెలిపిన సమాచారం మేరకు పోలీసులు స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాలో నమోదైన వీడియో దృశ్యాలను పరిశీలించగా, స్టేషన్‌లో చిరుతపులి చొరబడి గదుల్లో ఆహారం కోసం వెదుకుతూ అక్కడి నుండి వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. ఆ వీడియో చూసినప్పటి నుంచి పోలీసులు ఆ స్టేషన్‌లో రాత్రిపూట పనిచేయడానికి జంకుతున్నారు.

కాట్పాడిలో హిందూ సంఘం కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న హిందూ సంక్షేమ సంఘం నాయకులు

వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి గాంధీనగర్‌లో హిందూ సంక్షేమ సంఘం నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు మహేష్, హిందూ మున్నని కోశాధికారి మూర్తి, ఆర్గనైజర్ రాజేష్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ఆరు సీట్లలో గెలవటం కష్టమే!

● ఆర్ఎస్ భారతి జోస్యం

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఆరు నియోజకవర్గాలలో గెలవటం కూడా కష్టమేనని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని గగ్గోలు పెడుతున్న ఎడప్పాడి పళనిస్వామి తన పాలనలో పొల్లాచ్చిలో జరిగిన సామూహిక అత్యాచారాల సంఘటన మరచిపోయినట్లుందన్నారు. తూత్తుకుడి స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా ప్రశాంతంగా ర్యాలీ చేస్తున్న వారిపై తుపాకీ కాల్పులు జరిపింది కూడా ఈపీఎస్ పాలనలోనే అని ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. కరప్షన్ పాలన అందించిన ఈపీఎస్ తదుపరి అన్నాడీఎంకే నెక్ట్స్ వర్షెన్ అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ఏసీ సబర్బన్ రైలు వేళల్లో మార్పులు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య నడుపుతున్న ఏసీ సబర్బన్ రైలు సమయాల్లో మార్పులు జరిగాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య నడుపుతున్న ఏసీ సబర్బన్ రైలుకు ప్రయాణికుల నుండి విశేష ఆదరణ లభించిందన్నారు. అదే సమయంలో ప్రయాణికుల అభిప్రాయాలమేరకు ఈ రైలు సమయం, బయల్దేరే ప్రాంతం తదితరాలు మార్పులు జరిగాయని తెలిపారు. ఆ ప్రకారం, తాంబరం నుంచి ఉదయం 6.50 గంటలకు బయల్దేరే ఏసీ సబర్బన్ రైలు 7.35 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది. చెంగల్పట్టు నుంచి 7.50 గంటలకు బయల్దేరి 9.25 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.41 గంటలకు బయల్దేరి 10.36 గంటలకు తాంబరం చేరుకుంటుంది. తాంబరం నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బయల్దేరి 1.55 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది. చెంగల్పట్టు నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి 6 గంటలకు చెన్నై బీచ్ చేరుకుంటుంది. చెన్నై బీచ్ నుంచి సాయంత్రం 6.17 గంటలకు బయల్దేరి రాత్రి 7.50 గంటలకు చెంగల్పట్టు చేరుకుంటుంది. చెంగల్పట్టు నుంచి రాత్రి 8.10 గంటలకు బయల్దేరి 8.50 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ సమయాల మార్పు శుక్రవారం (మే 2వ తేది) నుంచి అమలుకు వస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

టీవీకే జెండాలో ఏనుగు చిహ్నంపై స్టే

● కేసు విచారణ వాయిదా

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాలో ఏనుగు చిహ్నం వినియోగించడంపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ జూన్ 4వ తేదీకి వాయిదాపడింది. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్బున్ అలియాస్ ఇళంగోవన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... ఇప్పటికే తమ పార్టీ జెండా ఏనుగు చిహ్నంతో ఉందని, అందుకు కేంద్ర ఎన్నికల సంఘం కూడా అంగీకరించిందని తెలిపారు. తాజాగా, నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ జెండాలోను ఏనుగు చిహ్నాలు వినియోగించారని, దానికి స్టే విధించాలని కోరాడు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా, పిటిషన్ తరఫున హాజరైన న్యాయవాది, అంగీకారం పొందిన పార్టీ చిహ్నాన్ని ఎవరూ వినియోగించేందుకు వీలు లేదని వాదించారు. ఈ వాదనల అనంతరం జూన్ 4వ తేదీకి కేసు విచారణ వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కయాదుపై మనసుపడిన శింబు


కయాదు లోహర్

'పార్కింగ్' వంటి హిట్ చిత్రాన్ని అందించిన దర్శకుడు రామ్‌కుమార్ డైరెక్షన్‌లో శింబు నటించనున్నారు. ఇందులో హీరోయిన్‌గా మలయాళ బ్యూటీ కయాదు లోహర్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం శింబు... 'థగ్‌లైఫ్' సినిమాలో అగ్ర నటుడు కమల్ హాసన్‌తో కలిసి నటిస్తున్నారు. ఈ మూవీ తర్వాత రామ్ కుమార్ దర్శకత్వంలో నటించేందుక శింబు అంగీకరించగా, హీరోయిన్‌గా కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్టు చిత్ర బృందం తాజాగా ప్రకటించింది. ప్రముఖ నటుడు సంతానం కూడా ఇందులో నటించనుండటం గమనార్హం. ఈ చిత్రం షూటింగ్‌ను సింగిల్ షెడ్యూల్‌లోనే పూర్తి చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఆ తర్వాత దేశింగు పెరియస్వామి డైరెక్ట్ చేసే తన 50వ చిత్రం, అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేసే 51వ చిత్రాల్లో శింబు నటించనున్నారు. ఈ రెండు మూవీలను ప్రముఖ బడా నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై డాక్టర్ ఐసరి కె.గణేష్ నిర్మించనున్నారు.

'పద్మభూషణ్' అజిత్‌కు అభినందనల వెల్లువ

చిత్రజ్యోతి


రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న అజిత్


కోలీవుడ్ అగ్రహీరో అజిత్ కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ్' అవార్డు ప్రకటించగా, దీనిని సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఈ నేపథ్యంలో అజిత్ కుమార్‌కు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అభినందనలు తెలుపుతూ ట్వీట్స్ చేస్తున్నారు. 'చిత్రపరిశ్రమలో సాధించిన విజయాలకుగాను కేంద్ర ప్రభుత్వం అత్యున్న పురస్కారాలలో ఒకటైన 'పద్మభూషణ్' అవార్డును అందుకున్న ప్రియ సోదరుడు అజిత్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు' అని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ట్వీట్ చేశారు. 'అమరావతి' మూవీతో చిత్రరంగ ప్రవేశం చేసిన అజిత్ కుమార్... తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. సినిమా, కార్ రేసింగ్, బైక్ రేసింగ్ అంటూ తనకు ఇష్టమైన రంగాలల్లో రాణిస్తున్నారు. సినీ రంగంలో అజిత్ సాధించిన విజయాలకు, ఆయన చేసిన సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ అవార్డును స్వీకరించిన అజిత్‌కు హృదయపూర్వక అభినందనలు' అంటూ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. 'భారతదేశంలోని అత్యుత్తమ నటుల్లో ఒకరైన అజిత్ కుమార్ 'పద్మభూషణ్' అవార్డును అందుకున్నందుకు హృదయపూర్వక అభినందనలు, సినిమా, రేసింగ్ రంగాల్లో రాణిస్తున్న అజిత్‌ను చూసి రాష్ట్రం గర్విస్తుంది. ఆయన మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని, మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను' అని బీజేపీ నేత కె.అన్నామలై పేర్కొన్నారు.

కొత్త నటీనటులతో మణిరత్నం ప్రయోగం!



దిగ్గజ దర్శకుడు మణిరత్నం ప్రయోగం చేయనున్నారు. అందరూ కొత్త నటీనటులతో అందమైన ప్రేమకథా చిత్రాన్ని రూపొందించేందుకు ఆయన ప్లాన్ చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం కమల్ హాసన్ హీరోగా 'థగ్‌లైఫ్' చిత్రాన్ని ఆయన తెరకెక్కించారు. ఇది జూన్ 5వ తేదీ విడుదలకానుంది. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మించాయి. ఈ మూవీ విడుదలైన తర్వాత మణిరత్నం తన తదుపరి ప్రాజెక్టుపై దృష్టిసారించనున్నారు. రొమాంటిక్ ఇతివృత్తంతో పూర్తిగా కొత్త వారితో ఈ లవ్‌స్టోరీని నిర్మించాలని ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి ప్రాథమిక చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. ఇప్పటికే కథ ఫైనల్ అయినప్పటికీ..దర్శకుడు స్క్రీన్‌ప్లేలో కొన్ని మార్పులు చేస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

23న 'పడై తలైవన్' రిలీజ్


'పడై తలైవన్'లో షణ్ముగ పాండియన్

దివంగత నటుడు కెప్టెన్ విజయ్‌కాంత్ చిన్న కుమారుడు షణ్ముగపాండియన్ నటించిన 'పడై తలైవన్' చిత్రం మే 23వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ పోస్టరు ద్వారా అధికారికంగా ప్రకటించారు. 'మదురై వీరన్' చిత్రం ద్వారా హీరోగా పరిచయమైన షణ్ముగ పాండియన్ తాజాగా 'పడై తలైవన్' మూవీలో నటించారు. 'వాల్టర్', 'రేక్లా' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన అన్బు దీనికి దర్శకుడు. ఇందులో సీనియర్ దర్శకుడు కస్తూరి రాజా, యామిని చందర్, గరుడన్ రామ్, ఎంఎస్ భాస్కర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. మెజార్టీ సన్నివేశాలన్నీ దట్టమైన అటవీ ప్రాంతంలో చిత్రీకరించారు. ఈ చిత్రానికి 'ఇసైజ్ఞాని' ఇళయరాజా సంగీత స్వరాలు అందించగా, డైరెక్టర్స్ సినిమాస్ పతాకంపై నిర్మాత జగన్నాథన్ పరమశివమ్ నిర్మించారు.

సింగపూర్ ఎయిర్‌పోర్టును తలపించేలా..!

అన్నిహంగులతో తిరుచ్చి కొత్త బస్ టెర్మినల్ సిద్ధం


ఏసీ సదుపాయం కలిగిన గ్రౌండ్‌ఫ్లోర్


కరుణానిధి విగ్రహం కోసం సిద్ధమవుతున్న పీఠం

రాష్ట్రంలో ద్వితీయ రాజధాని నగరంగా ప్రకటించడానికి అనువైన అన్ని సదుపాయాలున్న తిరుచ్చి నగరంలో పంజపూర్రు వద్ద సింగపూరు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తలపించేలా అన్ని హంగులతో నిర్మించిన కొత్త బస్ టెర్మినల్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ చొరవతో తిరుచ్చి కార్పొరేషన్ ఆధ్వర్యంలో, పంజపూర్రులో 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.247 కోట్లతో అత్యంత ఆధునిక ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ బస్‌టెర్మినల్‌ను మే 9న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


బస్‌టెర్మినల్ ప్రవేశద్వారం

2 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు..

ఈ కొత్త బస్ టెర్మినల్‌కు ప్రతిరోజూ సుమారు 1.5 లక్షల నుండి 2 లక్షల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లే అవకాశం ఉందని రవాణా శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అంతమంది ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు తిరుచ్చి - మదురై రహదారిలో ప్రధానమైన నీటి పైప్‌లైన్ నుంచి ఈ బస్ టెర్మినల్‌కు కావేరి నదీ జలాలను మళ్లిస్తున్నారు.


వాటర్ కూలర్స్

ప్రైవేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలు...

ఈ బస్ టెర్మినల్ నిర్వహణ బాధ్యతలను 15 యేళ్ల పాటు కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు సంస్థకు అప్పగించాలని తిరుచ్చి కార్పొరేషన్ నిర్ణయించింది. ఒక వేళ్ల బస్ టెర్మినల్‌ను ఆ ప్రైవేటు సంస్థ సక్రమంగా నిర్వహించకపోతే ఏ సమయంలోనైనా కాంట్రాక్టును రద్దు చేసుకునే నిబంధనతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇన్నేళ్లపాటు తిరుచ్చి సెంట్రల్ బస్‌స్టేషన్‌లో పగిలిన పైకప్పులు, దుర్వాసనతో మరుగుదొడ్లు, గతుకుల రహదారి, చెత్తకుప్పలతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు ఇకపై పంజప్పూరు బస్ టెర్మినల్‌లో ఉన్న అంతర్జాతీయ స్థాయి సదుపాయాలను చూసి విస్తుపోవటం ఖాయమని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

401 బస్సులకు హోల్టింగ్....

ఈ కొత్త బస్ టెర్మినల్‌లో దిగువ అంతస్తులో వివిధ నగరాలకు, సుదూర ప్రాంతాలకు వెళ్లే 345 బస్సులను నిలిపేందుకు సదుపాయం ఉంది. మొదటి అంతస్థులో 56 సిటీ బస్సులు నిలపటానికి వీలుంది. అంతే కాకుండా 78 దుకాణాలు, రెండు హోటళ్లు, రెండు టిఫిన్ సెంటర్లు, ప్రయాణికులకు వెయిటింగ్ రూమ్‌లు, లగేజీ, తదితర వస్తువులను భద్రపరిచే సదుపాయాలు కూడా ఉన్నాయి.

విశాలమైన పార్కింగ్ ...

ఈ బస్ టెర్మినల్ దిగువన వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. ఈ పార్కింగ్ ప్లేస్‌లో 1544 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు వీలుంది. వాహనాలను పార్కింగ్‌చేసిన తర్వాత ప్రయాణికులు దిగువ అంతస్థు, మొదటి అంతస్థుకు వెళ్లటానికి ఎస్కలేటర్లు, లిఫ్టులు, మెట్ల దారి ఉన్నాయి. ఇదే విధంగా కార్లు, వ్యాన్లు, టాక్సీలు ఇలా 216 నాలుగు చక్రాల వాహనాలను నిలిపే పార్కింగ్ కూడా ఉంది.

ఏసీ సదుపాయం...

ఈ బస్ టెర్మినల్‌లో ఆరుచోట్ల వాటర్ కూలర్లున్నాయి. వీటిలో చన్నీళ్లు, వేడి నీళ్లు వస్తాయి. అగ్నిమాపక నిరోధక పరికరాలు, ఎమర్జెన్సీ అలారమ్ వ్యవస్థ, ఉచిత వైఫై సదుపాయం, ఏటీఎం సెంటర్లు తదితర సదుపాయాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికి తోడు గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేశారు.. రాష్ట్రంలోనే ప్రయాణికులు ఉపయోగించే గ్రౌండ్ ఫ్లోర్ పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడిన తొలి బస్ టెర్మినల్ ఇదేనని అధికారులు చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా ఇబ్బంది లేకుండా 500 కె.వి. సామర్థ్యం కలిగిన 4 జనరేటర్లు ఏర్పాటు చేశారు.

ఎల్‌ఈడీ డిస్ ప్లే బోర్డులు...

ఈ బస్‌టెర్మినల్ ప్రాంగణమంతటా 50 ఎల్‌ఈడీ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా బస్‌టెర్మినల్‌లోని అన్ని ప్రాంతాలపై ప్రత్యక్ష నిఘా వేసేలా 166 సీసీ కెమెరాలు బిగించి, ప్రత్యేక కంట్రోల్ రూమ్ కూడా సిద్ధం చేశారు. ఇక ఈ బస్ టెర్మినల్ ప్రాంగణం ప్రవేశద్వారానికి సమీపంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించనున్నారు. ఈ బస్‌టెర్మినల్‌లో 173 మూత్రవిసర్జనశాలలు, పురుషులకు 42, మహిళలకు 59, హిజ్రాలకు 2, దివ్యాంగులకు 4 చొప్పున మొత్తం 107 మరుగుదొడ్లు కూడా నిర్మించారు. వీటికి చేరువగానే నాలుగు స్నానపు గదులు కూడా ఉన్నాయి. బస్‌టెర్మినల్ ముందు వైపు 50 ఆటోలు, వెనుకవైపు 50 ఆటోలు నిలిపేందుకు అనువైన స్థలం కూడా ఉంది. ఇన్ని హంగులతో నిర్మితమైన ఈ కొత్త బస్‌టెర్మినల్ మే 9 నుండి ప్రయాణికులకు వింత అనుభూతిని కలిగించడం ఖాయమని తిరుచ్చి కార్పొరేషన్ అధికారులు తెలిపారు.



అధునాతన టాయిలెట్లు - బస్సుల రాకపోకలకు నిర్మించిన ప్రత్యేక దారి

పద్మశ్రీ చెఫ్ దామోదరన్‌కు ఘన సత్కారం

అడయార్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పద్మశ్రీ అవార్డు పొందిన పాకశాస్త్ర ప్రవీణుడు చెఫ్ డాక్టర్ కె.దామోదరన్‌కు చెన్నైలోని దక్షిణ భారత చెఫ్స్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ) ఆధ్వర్యంలో ఘన సత్కారం జరిగింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఐఎఫ్‌సీఏ అధ్యక్షుడు, చెఫ్ మంజిత్ సింగ్ గిల్, ఎస్ఐసీఏ ప్రధాన కార్యదర్శి చెఫ్ శీతలాం ప్రసాద్, బోర్డు సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై దామోదరన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పాకశాస్త్ర ప్రవీణుడైన దామోదరన్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నారని ప్రశంసించారు. తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపరచడంలో దామోదరన్ ఎంతో సహకరించారని, 32 జిల్లాలకు చెందిన 1.40లక్షల మంది మధ్యాహ్న భోజన కార్మికులకు పాకశాస్త్రంలో శిక్షణ ఇచ్చారన్నారు. అదే విధంగా 2010లో 617 రకాల వంటకాలను చేసి, గిన్నిస్ వరల్డ్‌రికార్డుల్లోకి ఎక్కారని, 6 వేలకు పైగా విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారని కొనియాడారు.



దామోదరన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెరియార్ ఆశయాలకు కవితా రూపం అందించిన భారతీదాసన్

- వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న విశ్వనాథన్, వైగో తదితరులు

చెన్నై, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెరియార్ ఆశయాలు, లక్ష్యాలకు కవితా రూపం అందించిన ఘనత భారతీదాసన్‌కు దక్కుతుందని వీఐటీ యూనివర్శిటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్ కొనియాడారు. స్థానిక వర్శిటీ ప్రాంగణంలో భారతీదాసన్ జయంతిని 'ప్రపంచ తమిళ దినోత్సవం'గా ప్రకటించాలంటూ పలు సంస్థల ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, మాజీ మంత్రి వైగై సెల్వన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. పెరియార్ ఆశయాలకు కవితా రూపం అందించిన ఘనత భారతీదాసన్‌కే దక్కుతుందన్నారు. మూఢనమ్మకాలు నిర్మూలించే చట్టాలను కర్ణాటక సహా పలు రాష్ట్రాలు గత 6,7 ఏళ్ల క్రితమే చేపట్టాయన్నారు. కానీ, రాష్ట్రంలో మాత్రం ఇప్పటికీ అమలులోకి రాకపోవడంతో శోచనీయమన్నారు. ఇటీవల కాలంలో ఏ భాషలో చదవాలి అనే చర్చ నడుస్తోందని, ఏ భాషలో చదవాలి, చదివించాలి అనే అంశాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు వదిలివేయాలని సూచించారు. విద్యకు సమాజాన్ని మార్చే శక్తి ఉందని గ్రహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిధులు కూడా పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా 'నెరింజి మలర్ కాట్టిటియే' అనే పుస్తకాన్ని వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించి, తొలి ప్రతి ఎండీఎంకే నేత వైగోకు అందజేశారు.

మాజీ మంత్రి ఇంటికి రజనీకాంత్

- వధూవరులకు ఆశీస్సులు


మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి కుటుంబ సభ్యులతో రజనీకాంత్

అడయార్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి నివాసానికి సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆకస్మికంగా వెళ్ళి నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్చి 3న వేలుమణి కుమారుడు విజయ్ వికాస్ వివాహం జరిగింది. ఈ పెళ్ళి వేడుకకు రజనీకాంత్‌ను మాజీ మంత్రి ఆహ్వానించారు. అయితే, 'జైలర్-2' షూటింగ్‌లో ఉన్నందున రజనీకాంత్ పెళ్ళికి హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో నగరంలోని మాజీ మంత్రి వేలుమణి ఇంటికి మంగళవారం వెళ్ళిన రజనీకాంత్... నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తనకు ఎంతో ఇష్టమైన రాఘవేంద్ర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు.


చిత్తిరై కృత్తిక సందర్భంగా సిరువాపురి మురుగన్ ఆలయం వద్ద మంగళవారం ఉదయం బారులు తీరిన భక్తులు

బాలమురుగన్ ఆలయంలో ఘనంగా కృత్తిక వేడుకలు



వేలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని రత్నగిరి బాలమురుగన్ ఆలయంలో మంగళవారం కృతిక సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు మురుగన్‌ను దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలబడ్డారు. ఉదయం 5.30 గంటలకు బంగారు, వెండి కవచం ధరించి దేవేరులతో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శివాచార్యుల వేదమంత్రోచ్చారణ మధ్య వైభవంగా ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం 12గంటలకు భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


సందర్శకులకు నీడ కోసం మెరీనా బీచ్‌లో ఏర్పాటు కానున్న వెదురు గొడుగు


విప్లవకవి భారతీదాసన్ 135వ జయంతి వేడుకల సందర్భంగా మెరీనాబీచ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, రాష్ట్ర మంత్రులు



చిరంజీవి 'విశ్వంభర' కోసం
ఎదురు చూస్తున్నా
హీరోయిన్ ఆషిక రంగనాథ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'విశ్వంభర' సినిమా కోసం తాను ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని హీరోయిన్ ఆషిక రంగనాథ్ తెలిపారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె, ఆలయం బయట మీడియాతో మాట్లాడుతూ 'విశ్వంభర'లో చిరంజీవితో కలిసి నటించానని, అటువంటి స్టార్‌తో నటించాలంటే అదృష్టం కూడా ఉండాలన్నారు. కాగా తమిళంలో 'సర్ధార్2', కన్నడలో మరో చిత్రంలో నటిస్తున్నట్టు వివరించారు.ఇక, తిరుమల శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందంటూ ప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

దుమ్ములేవకుండా శుభ్రం చేస్తుంది

● టీటీడీకి విరాళంగా ఆధునిక వాహనం



తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దుమ్ము లేవకుండా వీధులు శుభ్రం చేసే వాహనం ఒకటి టీటీడీకి మంగళవారం విరాళంగా అందింది. రూ.25 లక్షల విలువైన ఈ వాహనాన్ని రోస్సెరి ప్రొఫెషనల్ అనే సంస్థ విరాళంగా ఇచ్చింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి వాహనం తాళాలు అందుకుని పనితీరును పరీక్షించారు. జర్మన్ కంపెనీకి చెందిన ఈ వాహనం చాలా అడ్వాన్స్ టెక్నాలజీతో కూడుకున్నదని ఆయన చెప్పారు. క్లీనింగ్ సమయంలో దుమ్ము పైకి లేవకుండా నీటిని చల్లుతూ ఆలయ పరిసరాలను శుభ్రపరుస్తుందన్నారు. 8 గంటల పాటు ఛార్జింగ్ పెడితే దాదాపు 46 కిలోమీటర్ల మేర వినియోగించవచ్చని వివరించారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,904

తలనీలాలు సమర్పించినవారు: 24,487

తిరుమలలో తెలంగాణవాసి మృతి

● మూర్ఛవ్యాధితో మరుగుదొడ్డిలోనే కుప్పకూలాడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఒక పబ్లిక్ మరుగుదొడ్డిలో మంగళవారం తెలంగాణవాసి ఒకరు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గద్వాల్‌కు చెందిన సురేష్‌గౌడ్(40) ఇరవై రోజుల కిందట ఇంటి నుంచి వచ్చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. అయితే సురేష్ గౌడ్ తిరుమలలో ఉంటున్నాడనే సమాచారంతో వారు రెండురోజుల కిందట తిరుమలకు చేరుకుని గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డిలో ఒక వ్యక్తి మృతదేహం ఉందని తెలిసి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతను సురేష్ గౌడ్ అని నిర్ధారించుకుని వారు కన్నీరుమున్నీరయ్యారు. గత కొంతకాలంగా సురేష్‌గౌడ్ మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నాడని, అనారోగ్యంతోనే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగాల తొలి జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తొలి జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఉద్యోగ నియామకాల నోడల్ అధికారి డాక్టర్ పార్థసారధిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను ప్రభుత్వ, ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. అందులో అభ్యంతరాలు కలిగిన అభ్యర్థులు మే 7వ తేదీ లోపు ఎస్వీ వైద్య కళాశాల ఉద్యోగ నియామకాల నోడల్ అధికారికి లిఖిత పూర్వకంగా పంపాలని పేర్కొన్నారు. అభ్యంతరాల కొరకు 80746 20526లో సంప్రదించాలని తెలిపారు.



బంగారం ధరలు ఇలా

24 క్యారెట్లు(10 గ్రాములు): 99,000

22 క్యారెట్లు(10 గ్రాములు): 99,904

సవర బంగారం : 74,112

కిలో వెండి : 1,00,300





కళ తప్పిన పసిడి

అక్షయ తృతీయ...గత కొన్నాళ్లుగా ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బంగారమే..వైశాఖ మాసంలో తొలి తదియకు పురాణాల ప్రకారం విశిష్ట ప్రాధాన్యముంది. ఈ రోజున ఏం చేసినా అక్షయంగా ఉంటుందని ఎక్కువ మంది విశ్వసిస్తారు. అందుకే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఈరోజు కొంటే అక్షయంగా పెరుగుతుందని నమ్ముతారు. అందుకే మహిళలు ఈ అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. వీరిని ఆకర్షించేందుకు బంగారం వర్తకులూ పోటీపడుతుంటారు. ప్రత్యేక ఆఫర్లు,డిస్కౌంట్లు ప్రకటిస్తుంటారు. అయితే ఈ ఏడాది మున్నెన్నడూ లేని విధంగా బంగారం ధరలు పెరిగి కలవర పెడుతున్నాయి. కొనుగోలుదారులు..వర్తకుల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. .షాపులో అడుగు పెట్టాలంటేనే మధ్యతరగతి వర్గాలు జంకుతున్నాయి. ఆశించిన అమ్మకాలు లేకపోవడంతో వ్యాపార వర్గాలూ నీరుగారుతున్నాయి. అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఈ వర్గాలు నిరీక్షిస్తున్నాయి.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

● గణనీయంగా పెరిగిన బంగారం ధరలు ● వెలవెలబోతున్న షాపులు
● అక్షయ తృతీయ మీద వ్యాపారుల ఆశలు

ఆఫర్లు ప్రకటించి ఎదురుచూస్తున్నాం



చాలా రోజులుగా వ్యాపారం లేదు. ఖాళీగా ఉంటున్నాం. గత ఏడాదికంటే పది గ్రాముల బంగారం ధరపై సగటున రూ.3వేలకు పైగా పెరిగిపోయింది. కొనుగోలు దారులు బాగా తగ్గిపోయారు. కొంతకాలం ఆగి తరువాత కొనుగోలు చేసుకుందామని ఆలోచిస్తున్నారు. అక్షయతృతీయ సందర్భంగా తరుగు, కూలీఛార్జీలు లేకుండా ఆఫర్లు ప్రకటించాం. బుధవారం అయినా కొనుగోలుదారులు వస్తారని ఆశిస్తున్నాం.

- కె.వి. సత్యనారాయణ, అధ్యక్షుడు, తిరుపతి గోల్డ్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్

గత ఏడాది కంటే 30 శాతం పైకి ధరలు

తిరుపతి నగరంలో బంగారం షాపులు సుమారుగా 80వరకూ ఉన్నాయి. అన్ని బ్రాండెడ్ షాపులూ ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇక్కడ రూ.2కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు వ్యాపారలావాదేవీలు జరుగుతాయి. గతేడాది మే 10న అక్షయ తృతీయ పర్వదినం సరికి గ్రాము బంగారం ధర (24 క్యారెట్లు) రూ.6,600 ఉండేది. దీంతో ఒక్క అక్షయ తృతీయ రోజునే రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల వరకూ వ్యాపారం జరిగింది. కొద్ది నెలలుగా ప్రపంచ వాణిజ్య రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రస్తుతం డాలర్ పౌండ్ విలువ రూ.3,000 నుంచి 3,500 వరకు ఉండగా.. వచ్చే సంవత్సరానికి ఆ ధర రూ.4,500 నుంచి రూ.6,000 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తర్వాత బంగారం ధర అమాంతం పెరిగిపోయింది. గతేడాది బంగారు గ్రాము ధర రూ.6,600 ఉండగా.. ఈ సంవత్సరం గ్రాము బంగారు ధర రూ.9,000కి చేరింది. అంటే రూ.3000 వరకూ పెరిగింది. ఈ ధరల పెరుగుదల ఇంతటితో ఆగుతుందనే నమ్మకం కూడా లేదు. దీంతో కొనుగోలుదారులు సంశయంలో పడిపోయారు.

రూ.2కోట్ల మేర వ్యాపారం జరగదా?

బుధవారం నాటి అక్షయ తృతీయ మీద వ్యాపార వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కనీసం రూ.2 కోట్ల మేరయినా అమ్మకాలు జరగకపోతాయా అని ఎదురు చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆశించిన మేర అమ్మకాలు జరగడంలేదని ఈ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. సాధారణంగా చాలామంది అక్షయ తృతీయ రోజున అంతోఇంతో బంగారం కొనుగోలు చేస్తుంటారు. కొద్దిరోజులుగా బంగారం ధరలు విని వీరు వెనుకంజ వేస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.లక్షకు ఎగబాకడంతో గుండెలు బాదుకుంటున్నారు. అక్షయ తృతీయకు ఈసారి పరిమితంగా కొనుగోలు చేయాలనుకుంటున్నామని తిరుపతిలోని కాపువీధికి చెందిన మధ్యతరగతి గృహిణి శ్రీదేవి చెప్పారు. మార్కెట్ ట్రెండ్ ప్రకారం ఈసారి ఆశించిన మేర అమ్మకాలు జరగకపోవచ్చునని కొందరు బంగారు వర్తకులు కూడా అభిప్రాయపడుతున్నారు.

నాణ్యత తనిఖీకి అవకాశం

గతంలో బంగారం కొంటున్నప్పుడు చాలామంది నాణ్యత చూసేవారుకాదు. ఇప్పుడు కొనుగోలుదారుల్లో అవగాహన పెరిగింది. హాల్ మార్క్ ఉందోలేదో చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌యూఐడీ విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి బంగారు వస్తువుపైన హెచ్‌యూఐడీ నంబర్ ఉంటుంది. బీఐఎస్ హాల్ మార్క్ తనిఖీ చేసి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా హెచ్‌యూఐడీ నంబర్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకునే సౌకర్యముంది. దీని ప్రకారం బంగారం నాణ్యతను గుర్తించవచ్చు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.95కోట్లు



శ్రీకాళహస్తి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,95,63,129 వచ్చింది. హుండీలను మంగళవారం ఉదయం లెక్కించారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 47.100 గ్రాములు, వెండి 702.100 కిలోలు, విదేశీ కరెన్సీ 158 వచ్చాయి. గత నెల 27 నుంచి ఈ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

నిశిరాత్రి యజమానిని కాపాడిన శునకం

● ఏనుగుల వదంతితో బావిలో పడిన వ్యక్తి
● కుక్క అరుపులు విని రక్షించిన అటవీసిబ్బంది



ఈశ్వరరావుతో అటవీసిబ్బంది

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యజమాని ప్రాణాలను కాపాడిందో శునకం. వివరాలు ఇలా.. సోమవారం రాత్రి భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తన సిబ్బందితో కలిసి చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచెర్ల, దేవరకొండ పంచాయతీలోని అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల కదలికలను గుర్తించేందుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలోకి ప్రవేశించారు. అప్పటికే రాత్రి ఒంటి గంట దాటింది. అదే సమయంలో సుబ్బరామాపురానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన పెంపుడు కుక్కతో పొలం వద్దకు కాపలాగా ఉన్నాడు. చుట్టు పక్కల రైతుల నుంచి ఏనుగులొచ్చాయంటూ గట్టిగా అరపులు విన పడడంతో ఈశ్వరయ్య ఉలిక్కిపడ్డాడు. వెంటనే పరుగుతీశాడు. ప్రాణ భయంతో హడావిడిలో దగ్గరలోని బావిలో పడిపోయాడు. కటిక చీకటి. సమీపాన ఎవరూ లేరు. అయితే యజమాని కష్టంలో ఉన్నాడని అతని పెంపుడు కుక్క గ్రహించింది. అదేపనిగా గట్టిగా అరవడం ప్రారంభించింది. ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఎఫ్ఆర్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలోని ఏలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ గమనించింది. ఏం జరిగిందో తెలుసుకుందామని వెంటనే అక్కడకు చేరుకుంది. బావిలో పడి ఉన్న ఈశ్వర్యను గుర్తించింది. అటవీ శాఖ సిబ్బంది దిగి ఈశ్వరరావును రక్షించి బయటకు తీశారు. పెంచుతున్న విశ్వాసానికి అర్ధరాత్రి అరణ్యప్రాంతంలో ఆ శునకం చూపిన ప్రేమాభిమానానికి అక్కడివారంతా ఆశ్చర్యపోయారు.

ఇక, రాత్రి గస్తీల్లో డ్రోన్

● పోలీసుల అదుపులో పది మందికి కౌన్సెలింగ్



డ్రోన్ కెమెరాతో పోలీసుల పహారా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాత్రి గస్తీల కోసం కేవలం బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు మాత్రమే రోడ్లపై తిరిగేవారు. అన్ని వీధులు, సందులు, గొందుల్లోకి వెళ్లడానికి వీరికి సాధ్యపడే పని కాకుండా పోయింది. ఈ క్రమంలో రాత్రి గస్తీకి డ్రోన్ వినియోగించాలని ఎస్పీ హర్షవర్ధనరాజు భావించారు. దీనికిగాను అత్యంత శక్తిమంతమైన మ్యాట్రిక్ 4 థర్మల్ డ్రోన్ కెమెరా వినియోగించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం అర్ధరాత్రి తిరుపతి, శివారు ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి రాత్రి పహరా కాశారు. తద్వారా అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న అకతాయిలు, కొందరు మందుబాబులను గుర్తించారు. అలా 10 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలా రాత్రి గస్తీల్లో డ్రోన్‌నూ భాగస్వామిని చేయనున్నారు. దీనికోసం తిరుపతి నగరాన్ని మూడు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లో ఒక్కో రాత్రి డ్రోన్ నిఘా ఉంచుతారు. ఇది అరకిలోమీటరుకు పైగా నింగిలోకి వెళ్లి.. మూడు కిలోమీటర్ల వ్యవధిలో కవర్ చేస్తుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడ నుంచైనా ఎమర్జెన్సీ కాల్ వస్తే వెంటనే డ్రోన్ కెమెరా ద్వారా లొకేషన్ అడ్రస్ ట్రేస్ చేసి బాధితులకు న్యాయం చేసే వెసులుబాటు కలుగుతోంది. లొకేషన్ అడ్రస్ చెప్పడం ఆలస్యం కాకుండా డ్రోన్ కెమెరాను అటుగా దిశ మళ్ళించి ఆగమేఘాల మీద ఆకాశంలో దూసుకుంటూ స్పాట్‌కు చేరుతుంది. తద్వారా పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటారు. తిరుపతి ప్రజలు, భక్తులు అర్ధరాత్రయినా ప్రశాంతమైన వాతావరణంలో గడపాలనే ఉద్దేశ్యంతో ఈ వినూత్న ప్రయోగానికి శీకారం చుట్టినట్లు ఎస్పీ చెప్పారు.

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలకు, జీజీహెచ్ ఆస్పత్రులకు ప్రిన్సిపల్స్‌ను, సూపరింటెండెంట్‌లను ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా రుయా సూపరింటెండెంట్ రవిప్రభును ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటిల్లో తిరుపతి, నంద్యాల, నెల్లూరు వైద్య కళాశాలల ప్రిన్సిపల్ నియామకాల్లో మంగళవారం మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా మొదట రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించిన అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ జె.రాధను ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ బుధవారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ పొందిన అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. రవిప్రభు రుయా సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.08 లక్షల మంది

● నేటితో ముగియనున్న గడువు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 16.05 లక్షల మంది రేషన్ కార్డుల్లో సభ్యులుగా వున్నారు. వీరిలో ఈనెల 29 వరకు దాదాపు 15 లక్షల మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. ఇక 1.08 లక్షల మంది ఈకేవైసీ చేసుకోకుండా దూరంగా వున్నారు. వీరందరికీ బుధవారం ఆఖరి గడువు విధించింది. అప్పటికే మూడు సార్లు గడువు పెంచిన ప్రభుత్వం మళ్లీ ఈకేవైసీ చేసుకోవడానికి గడువు పెంచుతుందా లేదా అనేది బుధవారం సాయంత్రానికి తెలుస్తుందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి, తిరుపతి, వెంకటగిరి, గూడూరు, కోట, నాయుడుపేట, పుత్తూరులోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాల కోసం అర్హత గల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజా సోము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంరక్షకుల ఆదాయం సంవత్సరానికి రూ.లక్ష మించరాదన్నారు. అలాగే 4 నుంచి 9వ తరగతి వరకున్న ఖాళీలకు కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99856 74700లో సంప్రదించాలన్నారు.

జయరాంచౌదరిని వర్చువల్‌గా విచారించనున్న కోల్‌కత్తా హైకోర్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'మయూర జయరాం చౌదరిని కోల్‌కత్తా హైకోర్టు బుధవారం వర్చువల్ విధానంలో విచారించనుంది. చక్కెర సరఫరా చేస్తామంటూ కోల్‌కత్తాకు చెందిన టెరాయ్ ఓవర్సీస్ సంస్థకు చక్కెర సరఫరా చేస్తామని 2014లో జయరామ చౌదరి రూ.8 కోట్లు అడ్వాన్సుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తడంతో చక్కెర సరఫరా చేయలేదు. రూ.3 కోట్లు వెనక్కు చెల్లించారు. ఇంకా రూ.5 కోట్ల మేరకు చెల్లించాల్సి ఉండటంతో 2023లో ఆ సంస్థ కోల్‌కతా హైకోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద కేసు వేసింది. దీనిపై విచారించిన న్యాయస్థానం జయరాంచౌదరిని అరెస్టుచేసి కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. ఆ మేరకు తిరుపతి పోలీసులు అరెస్టుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం కోల్‌కత్తా హైకోర్టు జయరాం చౌదరిని పోలీసుల సమక్షంలో వర్చువల్ విధానంలో విచారించనుంది.



రాజపక్సకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ ఈవో

తిరుమలలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు

తిరుమల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): శ్రీలంక మాజీ అధ్యక్షుడు నందసేన గొటబయ రాజపక్స శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని సమిష్టి అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవోఆర్ భాస్కర్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. రాజపక్స బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఐటీఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ)లో 2025 విద్యాసంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 24వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 9492861369, 8500021856 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

స్మగ్లర్ అరెస్టు

మంగళం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భాకరపేట అటవీప్రాంతంలోకి ప్రవేశిస్తున్న ఓ స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి పిడిలేని ఇనుప గొడ్డలి, బారిసను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం భాకరాపేట చామల సెక్షన్‌లో కూంబింగ్ నిర్వహించారు. తిరుపతి -పీలేరు రోడ్డు వైపున నిషేధిత అటవీప్రాంతంలోకి ముగ్గురు వ్యక్తులు వెళుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసుల కంటపడ్డారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా అడవుల్లోకి పారిపోయారు. అయితే ఒకరిని పట్టుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 గంటలు ఆలస్యంగా 'పూరీ ఎక్స్‌ప్రెస్'

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): తిరుపతి- పూరీ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ తొమ్మిది గంటలు ఆలస్యంగా నడిచింది. సోమవారం రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్, మంగళవారం ఉదయం 7 గంటలకు చేరుకొంది. దీంతో వందలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. భక్తులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న వారు నిర్ణీత సమయానికి దర్శనానికి వెళ్ళలేక పోయారని తెలిసింది. సకాలంలో తిండి లభించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక, మంగళవారం తిరుపతిలో 10.40 గంటలకు బయలు దేరాల్సిన పూరీ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.45 గంటలకు బయలు దేరి వెళ్ళిందని అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ప్రయాణికులు తిరుపతి రైల్వే స్టేషన్‌లో మూడుగంటలు నిరీక్షించారు.

సూర్యవంశీ ఒక అద్భుతం

● శ్రీవారి సన్నిధిలో చెబుతున్నా
పెద్ద ప్లేయర్ అవుతాడన్న క్రికెటర్ శ్రీశాంత్



ఆలయం ముందు కుటుంబంతో శ్రీశాంత్

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): 'సచిన్ టెండూల్కర్ రంజీ మ్యాచుల్లో 14 ఏళ్లకే సెంచరీ చేసిన విషయాన్ని విన్నాం. ఐపీఎల్ వంటి పెద్ద ఆటలో 14 ఏళ్ల కుర్రాడు సెంచరీ కొట్టడం అంటే అదో అద్భుతం. గుజరాత్‌పై మ్యాచ్‌లో సూర్యవంశీ సూర్యుడిలా చెలరేగిపోయాడు' అని టీం ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ప్రశంసలతో ముంచెత్తారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి సన్నిధి నుంచి చెప్తున్నా వైభవ్ సూర్యవంశీ చాలా పెద్ద ప్లేయర్ అవుతాడన్నారు.

ది రియల్ తలై అజిత్ అన్నా

తమిళ హీరో అజిత్ పద్మభూషన్ అవార్డు తీసుకోవడంపై శ్రీశాంత్ సంతోషం ప్రకటించారు. అజిత్‌కు తానో పెద్ద అభిమానని, ఆయన డైలాగ్స్ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. 'ది రియల్ తలై అజిత్ అన్నా' అన్నారు. ఇక, రాజకీయల్లో ఎంట్రీపై ప్రశ్నించగా ప్రస్తుతం అలాంటి ఆలోచనలు ఏవీ లేవని బదులిచ్చారు.